ఈనాడు
మెదక్
బుధవారం సెప్టెంబరు 25, 2024

శిరస్త్రాణం, సీటు బెల్ట్ తప్పనిసరి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్. చిత్రంలో ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్, న్యూస్‌టుడే: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున శిరస్త్రాణం, సీటు బెల్ట్ వినియోగం తప్పనిసరి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో జిల్లా స్థాయి రోడ్డు భద్రత సమావేశం నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. బ్లాక్ స్పాట్ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ వైద్యం అందేలా 108 సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం సంబంధిత అధికారుల సమన్వయంతో పనిచేస్తోందని పేర్కొన్నారు.

ఓటరు జాబితాపై అవగాహన

నియోజకవర్గాల్లో బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి, ఓటరు జాబితాకు సంబంధించి మార్పులు, చేర్పుల గురించి వివరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. ఓటరు నమోదుపై మంగళవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లతో దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. మరణించిన ఓటర్లను తొలగించడం, ఫోటో గుర్తింపు కార్డుకు సంబంధించి సరిగా లేని ఫొటోలను సేకరించాలన్నారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ర.భ ఈఈ సర్దార్ సింగ్, జాతీయ రహదారి పీడీ మాధవి, మెదక్, నర్సాపూర్ ఆర్డీవోలు రమాదేవి, జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నర్సాపూర్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా అటవీ శాఖ అధికారి జోజి అన్నారు. నర్సాపూర్ అర్బన్ పార్కులో అటవీశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని సూచించారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని అన్నారు. ప్రిన్సిపల్ దామోదర్, రేంజ్ అధికారి అరవింద్, సాయిరామ్, బీట్ అధికారి గోపాల్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు అటవీ మార్గంలో ఇరువైపులా పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు.

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిశీలన


తూప్రాన్‌లో ఎఫ్‌టీఎల్ వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీవో జయచంద్రా రెడ్డి

తూప్రాన్, మనోహరాబాద్, న్యూస్‌టుడే: హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న తూప్రాన్ డివిజన్‌లోని తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటల పరిధిలో ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను తూప్రాన్ ఆర్డీవో జయచంద్రా రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మనోహరాబాద్ మండలంలో 105 చెరువులకుగాను 77 చెరువులు, తూప్రాన్ మండలంలోని 138 చెరువులకు 93 చెరువులపైన గతంలో ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసినట్లు తెలిపారు. తుది నోటిఫికేషన్ కోసం హెచ్ఎండీఏ జారీచేసిన చెరువు మ్యాప్‌ల ఆధారంగా, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సర్వే చేపట్టామన్నారు. తూప్రాన్ మండలంలోని 23 చెరువులు, మనోహరాబాద్ మండలంలో 22 చెరువుల తుది నోటిఫికేషన్ సర్వే పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఆదాయం ఘనం.. అవస్థలు కనం

● సమస్యల వలయంలో తహసీల్దార్ కార్యాలయాలు



రిజిస్ట్రేషన్ల ద్వారా నిత్యం రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా.. కార్యాలయంలో కనీస సౌకర్యాలు ఉండటం లేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ గంటల తరబడి కొనసాగడంతో అప్పటివరకు వేచి ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీరు, శౌచాలయాలు ఉండటం లేదు. మరోవైపు చేయి తడపందే పనులు జరగడం లేదు. కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయడం లేదు. జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో నెలకొన్న ఇబ్బందులపై 'న్యూస్‌టుడే' బృందం మంగళవారం పరిశీలించింది.


టేక్మాల్‌లో బయట నిరీక్షిస్తూ..

చేయి తడపందే పనికాదు..

మెదక్ తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్, సిబ్బంది ద్వారా ప్రతి ఫైలుకు రూ.1000-2000 వసూలు చేస్తున్నారు. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.1-5వేలు 'మీ-సేవ' నిర్వాహకులు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చేగుంట మండలంలో కొన్ని రోజుల క్రితం వరకు రిజిస్ట్రేషన్ చేశాక రైతుల నుంచి డబ్బులు తీసుకునేవారని ఆరోపణలు ఉన్నాయి. అంతకుముందు పనిచేసిన మరో అధికారి కూడా టేబుల్ డ్రాలో డబ్బులు వేయాలని.. దానిని తెరచి ఉంచేవారని రైతులు తెలిపారు. కార్యాలయంలో కూర్చునేందుకు కుర్చీలు లేవు. ఎక్కువ మంది వస్తే బయటే నిరీక్షించాలి. మనోహరాబాద్‌లో గతంలో ఓ ప్రైవేటు ఉద్యోగిని పెట్టి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.


పాపన్నపేటలో విరిగిన కుర్చీలు

వసతులు లేక ఇక్కట్లు..

వెల్దుర్తి, అల్లాదుర్గంలో కార్యాలయాలు ఇరుకుగా ఉండటంతో చెట్ల కింద నిరీక్షించాల్సిందే. టేక్మాల్‌లో కార్యాలయం వద్ద తాగునీటి ట్యాంక్ ఏర్పాటు చేసినా.. బోరు పనిచేయక నిరుపయోగంగా ఉంది. మనోహరాబాద్‌లో వర్షం పడితే స్లాబు నుంచి నీరు కారుతోంది. నర్సాపూర్‌లో శౌచాలయాలు లేవు. భవనం ఎత్తయిన గుట్టపై ఉండటంతో వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. కోతుల బెడద తీవ్రంగా ఉంది. నిజాంపేటలో వెంకటేశ్వర్ల కార్యాలయం కొనసాగుతోంది. రేగోడ్, కౌడిపల్లి, చేగుంట, నార్సింగిలో శౌచాలయాలు లేవు. హవేలిఘనపూర్, పాపన్నపేటలో ప్రింటర్ పని చేయడం లేదు. కొన్ని కుర్చీలు విరిగిపోయాయి.


నర్సాపూర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద చెట్ల కింద కూర్చొని..

మౌలిక వసతులు కల్పిస్తాం

తహసీల్దార్ కార్యాలయాల్లో సౌకర్యాల కల్పనపై దృష్టిసారిస్తాం. సమస్యలు ఉన్నచోట వివరాలు తెలుసుకొని మౌలిక వసతులు కల్పిస్తాం. కంప్యూటర్లు, ప్రింటర్లు కొత్తవి ఏర్పాటు చేస్తాం. రిజిస్ట్రేషన్ల కోసం సిబ్బంది, అధికారులు డబ్బులు అడిగితే కలెక్టరేట్‌లోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి.

వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది. పెద్దశంకరం పేటలో సీనియర్ అసిస్టెంట్ పోస్టు, రామాయంపేటలో ఆర్ఐ-2 పోస్టు, నిజాంపేటలో డిప్యూటీ తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది.

న్యూస్‌టుడే-మెదక్, నర్సాపూర్, మెదక్ టౌన్, పాపన్నపేట, వెల్దుర్తి, చేగుంట, పెద్దశంకరంపేట, టేక్మాల్, మనోహరాబాద్, హవేలిఘనపూర్, రేగోడ్, రామాయంపేట, కౌడిపల్లి

మట్టి తవ్వకాలపై నివేదిక

శివ్వంపేట, న్యూస్‌టుడే: 'మట్టి కనిపిస్తే..మాయం' అనే శీర్షికతో 'ఈనాడు'లో మంగళవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్ల, నిత్య దేవమ్మ కూడా తండాలో అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలను తహసీల్దార్ కమలాద్రి ఆదేశాల మేరకు ఆర్ఐలు కిషన్, సునీల్ మంగళవారం పరిశీలించారు. పెద్దగొట్టుముక్కలలో 400 కేవీ విద్యుత్తు ఉప కేంద్రానికి మట్టి తీసుకెళుతుండగా, టిక్యా దేవమ్మ గూడ తండాలో ఎవరు తరలించారో తెలియాల్సి ఉందన్నారు. ఈ మేరకు అధికారులకు నివేదిక సమర్పించామని తెలిపారు.

రాజకీయ లబ్ధికే దాడి నాటకం: కాంగ్రెస్


గాయపడిన కాంగ్రెస్ కార్యకర్తల ఫొటోలు చూపుతున్న హన్మంతరావు, చిత్రంలో నర్సారెడ్డి, రాజిరెడ్డి

నర్సాపూర్, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం గోమారంలో జరిగిన చిన్న సంఘటనను భూతద్దంలో చూపి, భారాస రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తోందని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆరోపించారు. నర్సాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు కట్టుకథ అల్లారని ఆరోపించారు. దాడి జరిగితే ఎవర్నికైనా గాయాలు కావాలి.. ధ్వంసం జరగాలి.. అవేవీ లేకుండానే దాడి జరిగిందనడం సరికాదన్నారు. మొదట కాంగ్రెస్ కార్యకర్తలపై కవ్వింపు చర్యలకు పాల్పడింది.. భారాస కార్యకర్తలేనని తెలిపారు. మాధవరెడ్డి కారుపై బాణాసంచా కాల్చారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు తప్పుడు ప్రచారం మానుకోవాలని, లేదంటే వారిని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎంతో మంది భారాస ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని, రెండు మంత్రి పదవులు ఇవ్వండి, అందరం వచ్చేస్తామని అంటున్నారని తెలిపారు. ఒక్కసారి గేట్లు తెరిస్తే తట్టుకోలేకపోయారు.. ఇక పూర్తిగా తెరిస్తే మీపని ఖతమని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఆవుల రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హరికృష్ణ, మెదక్ మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, నాయకులు సుహాసిని రెడ్డి, వెంకట్రాంరెడ్డి, మల్లేశం, అంజిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాధవరెడ్డిని పరామర్శించిన నేతలు

శివ్వంపేట: గోమారంలోని కాంగ్రెస్ నేత, ఏఎంసీ మాజీ వైస్‌ఛైర్మన్ పెద్దపట్లోరి మాధవరెడ్డి కారును భారాస నాయకులు పాడు చేసిన నేపథ్యంలో ఆయనను మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, మదన్‌రెడ్డి, తూముకుంట నర్సారెడ్డి మంగళవారం పరామర్శించారు. కారుపై నిప్పురవ్వలు పడి పాడైందని, కాంగ్రెస్ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారని మాధవరెడ్డి వారికి వివరించారు. దాడి చిత్రాలను చూపుతూ హన్మంతరావు మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పెద్దపట్లూరి బుచ్చిరెడ్డి, హనుమంతరెడ్డి, వెంకట్రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

రాయరావు చెరువుకు హరిత రాజసం


నందనవనం ఏర్పాటు

న్యూస్‌టుడే, నర్సాపూర్: జిల్లాలోనే అత్యధిక సాగు విస్తీర్ణం కలిగిన నర్సాపూర్‌లోని రాయరావు చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అనేక చర్యలు తీసుకుంటున్నారు. చెరువు పరిసరాలను పచ్చతోరణంగా మార్చడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుందరీకరణలో భాగంగా పెద్దఎత్తున మొక్కలు నాటుతున్నారు. చుట్టూ ఎత్తయిన కొండలు, గుట్టలు, పచ్చని అడవులు, నిండుకుండను తలపించే చెరువు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఉంటుంది. చెరువు పొడవునా కట్ట పైన, వెనక భాగంలో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటారు. కానుగ, టేకు, వేప, సిల్వర్‌ఓక్, అల్ల నేరేడు, రాగి, ఔషధ మొక్కలు నాటడానికి నిర్ణయించారు. ఆయా ప్రాంతాల నుంచి తెచ్చిన మొక్కలు నాటేందుకు సమాయత్తమవుతున్నారు. వీటి సంరక్షణకు ఆధునిక పద్ధతులు ఆచరిస్తున్నారు. పశువుల ఎరువు, పూడికమట్టిని గుంతల్లో పూడ్చడానికి ఉపయోగిస్తున్నారు. నాటిన మొక్కలకు నీటిని అందించడానికి చర్యలు తీసుకున్నారు.

పిల్లలకు ఆట వస్తువులు

చెరువు వద్ద పచ్చదనం వెల్లివిరిసేలా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం ప్రజలు అక్కడికి వచ్చి బెంచీలపై సేదతీరుతున్నారు. పిల్లలు, పెద్దలు, కళాశాలల విద్యార్థులు, యువతీ, యువకులు భారీగా తరలివస్తున్నారు. పిల్లలు ఆటలాడేందుకు ఏర్పాటు చేసిన ఆట వస్తువుల సమీపంలోనూ పచ్చదనం కనిపించేలా సుందరీకరించారు. పూలమొక్కలు, విశాలంగా పెరిగి నీడనిచ్చే ఆకర్షణీయమైన మొక్కలు వెయ్యికి పైగా తెచ్చారు. పురపాలక అధ్యక్షులు అశోక్ గౌడ్, కమిషనర్ రామకృష్ణారావుల ప్రత్యేక చొరవతో నందనవనానికి రూపం తెచ్చారు. ఇందుకోసం పుర సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. చెరువు కట్ట ప్రధాన ద్వారం నుంచి ఇరువైపులా పచ్చని మొక్కలు సందర్శకులకు స్వాగతం పలుకుతుంటాయి.

సందర్శకుల సంఖ్య పెరిగింది

అశోక్‌గౌడ్, పురపాలిక అధ్యక్షుడు

చెరువు కట్టపైన పచ్చదనం అందరినీ ఆకట్టుకుంటోంది. దీంతో సందర్శకుల సంఖ్య చాలావరకు పెరిగింది. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అభివృద్ధి పరుస్తున్నాం. ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.

ఎస్జీటీలను రిలీవ్ చేయాలని మంత్రికి వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న మహిపాల్‌రెడ్డి, వెంకటేశం తదితరులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయకుండా సర్దుబాటు చేయడం భావ్యం కాదని ఎస్జీటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరివేద మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం అన్నారు. హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం గ్రహించి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆ తరువాతే సర్దుబాటు చేయాలని కోరారు. జీవో 25ను సవరించాలనే డిమాండ్‌తో బుధవారం నుంచి ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు నిచ్చారు.

వానొస్తే.. రాకపోకలకు అవస్థలే..


పొలంపల్లి వద్ద రైల్వే వంతెన కింద నిలిచిన నీళ్లు

రైల్వే భూగర్భ వంతెన కింద నీళ్లు నిలవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చేగుంట మండలం పొలంపల్లి వద్ద సికింద్రాబాద్-ముద్కేడ్ రైలు మార్గంలో కాపలాలేని క్రాసింగ్ వద్ద గతంలో భూగర్భ వంతెన నిర్మించారు. మెదక్ రోడ్డు నుంచి పొలంపల్లి మీదుగా రెడ్డిపల్లి కాలనీ వరకు 44వ జాతీయ రహదారికి చేరుకునేందుకు ఇదే దగ్గరి మార్గం. వర్షం కురిసి పొలంపల్లి చెరువు నిండితే చాలు వంతెన కింద నడుము లోతు వరకు నీరు నిలిచిపోతుంది. ఇక రైతులు, మహిళలు, ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకరంగా వంతెన గోడపై నుంచి నడుచుకుంటూ రైలు పట్టాలు దాటి వెళ్తున్నారు. ఈ సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా రైలు వచ్చి ఢీకొనే ప్రమాదం ఉంది. వంతెన కింద నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చేగుంట

ఎంఈవోల నియామకం

మెదక్: నూతన విద్యా విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం.. పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు చాలా ఏళ్లుగా ఖాళీగా ఉన్న మండల విద్యాధికారుల పోస్టుల్లో మంగళవారం సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను నియమించింది. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 21 మండలాలకు గాను ముగ్గురు మండల విద్యాధికారులు మాత్రమే ఉన్నారు. వీరు ఆయా మండలాల అదనపు బాధ్యతలను నిర్వహిస్తూ వచ్చారు. ప్రతి మండలానికి ఒక మండల విద్యాధికారిని నియమించారు. నోడల్ అధికారిగా కొనసాగుతున్న వారికి ఎంఈవోలుగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. మెదక్ మండలానికి నీలకంఠం, శివ్వంపేటకు బుచ్చానాయక్, వెల్దుర్తికి ఏ.యాదగిరి, నర్సాపూర్‌కు తారాసింగ్, కొల్చారానికి సత్యనారాయణ, మాసాయిపేటకు ధర్మపూరి, రేగోడ్‌కు గురునాథ్, పెద్దశంకరంపేటకు వెంకటేశం, అల్లాదుర్గంకు ధనుంజయ, కౌడిపల్లికి బాలరాజ్, చిలప్‌చెడ్‌కు విఠల్, చేగుంటకు నీరజ, నార్సింగికి రామకృష్ణ, తూప్రాన్‌కు సత్యనారాయణ, చిన్నశంకరంపేటకు పుష్పవేణి, మనోహరబాద్‌కు మల్లేశం, హవేలీఘనపూర్‌కు మధుమోహన్, పాపన్నపేటకు ప్రతాప్ రెడ్డి, టేక్మాల్‌కు సుజాత, రామాయంపేటకు శ్రీనివాస్, నిజాంపేట మండలానికి ఎస్.యాదగిరి నియమితులయ్యారు.

చాకరిమెట్ల ఆలయ హుండీ ఆదాయం రూ.6.77లక్షలు


కానుకలు లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్ల గ్రామం శ్రీసహకార ఆంజనేయ స్వామిదేవాలయం హుండీ ఆదాయం రూ.6.77లక్షలని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు రంగారావు, ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ ఆంజనేయ శర్మ, ఈవో సార శ్రీనివాస్ తెలిపారు. దేవాలయంలో మంగళవారం 5నెలల 24రోజుల హుండీ లెక్కింపు లెక్కించగా.. రూ.6,77,762 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భ్రమరాంభ సేవా సమితి, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీతారెడ్డికి పరామర్శ


సునీతారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీలు యాదవ రెడ్డి, సుభాష్ రెడ్డి తదితరులు

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండలం గోమారంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యేను ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, యాదవరెడ్డి, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ హేమలత శేఖర్ గౌడ్ దంపతులు, నేతలు చంద్ర గౌడ్, మన్సూర్, యాదాగౌడ్, భారాస నాయకులు పరామర్శించారు.

అకాల వర్షంతో ఆందోళన


పోచంరాల్‌లో నేలకొరిగిన వరి పంట

హవేలిఘనపూర్, మెదక్, న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం పలు చోట్ల వర్షం పడింది. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌లో 47 మి.మీలు, వెల్దుర్తిలో 45.5, కొల్చారంలో 35, శివ్వంపేటలో 30, హవేలీఘనపూర్ మండలం సర్దనలో 22.3 మి.మీల వర్షపాతం నమోదైంది. మెదక్‌లో అరగంట పాటు వర్షం కురిసింది. హవేలీఘనపూర్ మండల పరిధి బూరుగుపల్లి, కూచన్‌పల్లి, సర్దన గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పోచంరాల్, బూర్గుపల్లి గ్రామాల్లో వరి పంట నేలకు ఒరిగింది.

ఖాళీ సిలిండర్లు నింపుతుండగా సిబ్బంది పట్టివేత


సిలిండర్లను తూకం వేస్తున్న గ్రామస్థులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఏజెన్సీ సిబ్బంది ఖాళీ సిలిండర్లలోకి దొంగతనంగా రీఫిలింగ్ చేస్తుండగా వెల్దుర్తి మండలం దామరంచ గ్రామస్థులు పట్టుకున్న సంఘటన మంగళవారం జరిగింది. వెల్దుర్తిలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నుంచి దామరంచ గ్రామంలోని వినియోగదారులకు పంపిణీ చేయడానికి సిబ్బంది వాహనంలో గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్తున్నారు. దామరంచ శివారులో సిబ్బంది.. నిండు సిలిండర్ల నుంచి ఖాళీ సిలిండర్లలోకి గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేస్తుండగా పొలాల్లో ఉన్న రైతులు గమనించి పట్టుకున్నారు. ఈ విషయం గ్రామస్థులకు తెలుపగా సిలిండర్ల వాహనాన్ని గ్రామ పంచాయతీ వద్దకు తరలించారు. ఖాళీ సిలిండర్లను తూకం వేయగా అధిక బరువు ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ సిలిండర్లలోకి గ్యాస్ నింపడం వల్లే అధిక బరువు తూగుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. ఇక ముందు ఇలా జరిగితే సహించేదిలేదని హెచ్చరించి వదిలేశారు.


ఇందిరాగాంధీ పేరుతో కొనసాగించడం సరికాదు: భాజపా


జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న గడ్డం శ్రీనివాస్, సతీష్

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: మెదక్ స్టేడియంకు అనధికారికంగా ఇందిరా గాంధీ అని నామకరణం చేయడం సరికాదని భాజపా జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సతీష్ అన్నారు. ఈమేరకు మంగళవారం మెదక్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... మెదక్ స్టేడియానికి కరణం, ఎన్టీఆర్, ధ్యాన్‌చంద్ పేర్లలో ఒక దానిని పరిశీలించి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారికంగా నామకరణం చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

సన్నాలకు బోనస్..

రైతులకు రూ.125 కోట్ల ప్రయోజనం



న్యూస్‌టుడే, చేగుంట: సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులకు మేలు జరగనుంది. ఇప్పటి వరకు ప్రభుత్వం కొనుగోలు చేసిన సన్న, దొడ్డు రకం ధాన్యానికి అటుఇటుగా ఒకే ధర ఉండటంవల్ల రైతులు నష్టపోయేవారు. దీంతో సన్నధాన్యాన్ని రైస్‌మిల్లర్లకు, ప్రైవేటు వ్యాపారులకు ఎక్కువ ధరకు విక్రయించేవారు. కొందరు మాత్రం ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మేవారు. ఇప్పుడు బోనస్ ఇవ్వడంతో చాలా మంది రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించనున్నారు.

1.02 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో గతంలో ఎన్నడు లేని విధంగా వానాకాలం సీజన్‌లో 1.02 లక్షల ఎకరాల్లో సన్నరకం వరి సాగు చేశారు. ముఖ్యంగా పాపన్నపేట, మెదక్, వెల్దుర్తి, రామాయంపేట, నిజాంపేట, చేగుంట, కొల్చారం, కౌడిపల్లి, టేక్మాల్, హవేలిఘనపూర్ తదితర మండలాల్లో సాగుచేశారు. దొడ్డు, సన్న రకాలు కలిపి జిల్లాలో 2.98 లక్షలు సాగుచేశారు. వర్షాలు బాగా కురవడంతో వరి పంటకు ఇబ్బంది లేకుండా ఉంది. ప్రస్తుతం చాలా చోట్ల పొట్ట దశకు వచ్చి పాలు పోసుకుంటున్నాయి.

అన్నదాతలకు మేలు

జిల్లాలో 25 లక్షల క్వింటాళ్ల సన్న ధాన్యం దిగుబడి రానుంది. ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో అన్నదాతలకు అదనంగా రూ.125 కోట్ల మేలు జరగనుంది. రెండు ఎకరాల్లో సన్నరకం సాగు చేసిన రైతులకు మరో రూ.25 వేల లాభం జరగనుంది.

జిల్లాలో వరి సాగు: **2.98** లక్షల ఎకరాలు
సన్నరకం: **1.02** లక్షల ఎకరాలు
దొడ్డు రకం: **1.96** లక్షల ఎకరాలు
సన్నరకం దిగుబడి: **25** లక్షల క్వింటాళ్లు
ప్రభుత్వ మద్దతు ధర:
ఏ గ్రేడ్ ధాన్యంకు: రూ.**2,320**
సాధారణ రకానికి: రూ.**2,300**

గతంలో తక్కువే

గతంలో సన్నరకాలను జిల్లా వ్యాప్తంగా 45వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేయగా.. ఇప్పుడు రెట్టింపు అయింది. ముఖ్యంగా సన్నవరికి ఎక్కువగా చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గిపోతుంటాయి. దొడ్డు రకాల కంటే సన్నాల దిగుబడి ఎకరాలకు 5 క్వింటాళ్ల వరకు తక్కువగా వస్తుందని రైతులు తెలిపారు. ప్రభుత్వం సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు విడివిడిగా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. వ్యవసాయశాఖ అధికారులు కూడా గ్రామాల్లో ఏఏ రైతులు సన్నరకాలు సాగుచేశారని సర్వే కూడా నిర్వహించారు.

నాచగిరి హుండీ ఆదాయం రూ.11.83 లక్షలు


కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

వర్గల్, న్యూస్‌టుడే: ప్రసిద్ధ నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గడిచిన 75 రోజులకు రూ.11,83,932 వచ్చినట్లు ఈవో అన్నపూర్ణ పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సాయంత్రం వరకు లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు, గౌరారం పోలీసులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు


మాట్లాడుతున్న వీరశెట్టి

టేక్మాల్, న్యూస్‌టుడే: చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని స్వయంశక్తి అగ్రి ఫౌండేషన్ ఛైర్మన్(మిలెట్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ) వీరశెట్టి పేర్కొన్నారు. టేక్మాల్ మండల పరిధిలోని పల్వంచలో రైతులకు మంగళవారం టేక్మాల్ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పల్వంచ, బొడ్మట్‌పల్లి గ్రామాల్లో కొర్ర సాగుద్వారా సేకరించిన ధాన్యాన్ని తీసుకొచ్చి యంత్రంలో నూర్పిడి చేశారు. పలు ధాన్యాల రకాలతో చేసి ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంఘం ఛైర్మన్ మొగులయ్య, సీఈవో వెంకటేశం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అనంతగిరి.. ఆహ్లాద సిరి!

న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ, వికారాబాద్ గ్రామీణ

ఎటూ చూసినా పచ్చదనం, కొండలు.. మూసీ నది పరవళ్లు.. మధ్యలో ఆలయం.. ఇవీ అనంతగిరి విశేషాలు. జిల్లా కేంద్రం వికారాబాద్‌కు 6 కి.మీ. దూరంలోని అనంతగిరి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోంది. అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) ఇందుకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వ ఆమోదానికి పంపింది. పచ్చజెండా ఊపడమే ఆలస్యం. మరోవైపు కేంద్రం స్వదేశీ అభియాన్ పథకం కింద రూ.100 కోట్లు మంజూరు చేసింది. తొలి దశలో రూ.38 కోట్లు వచ్చాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది.


అనంతగిరి అడవిలో పర్యాటకులు

అభివృద్ధి ఇలా..

● అనంతగిరి కొండల్లో పర్యాటకులు బస చేసేందుకు నాలుగు కాటేజీలను ఆధునికీకరిస్తారు.


గ్రాస్‌ల్యాండ్ ప్రాంతం ఇదే..

డైనింగ్ హాల్ నిర్మించనున్నారు.

● ఇక్కడి గ్రాస్‌ల్యాండ్‌లో పర్యటించేందుకు సఫారీ వాహనం సమకూర్చారు. అక్కడే అల్పాహారం, ఆ తర్వాత ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిస్తూ..

– జ్ఞానేశ్వర్, డీఎఫ్‌వో, వికారాబాద్



అనంతగిరి కొండల్లో పర్యావరణం దెబ్బతినకుండా అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. స్వదేశీ అభియాన్ పథకం కింద కేంద్రం అనంతగిరి కొండలను, భువనగిరిని ఎంపిక చేసింది. పర్యాటకానికి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. అనంతగిరికి రూ.100 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తుంది. అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోనూ పలు అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి.

80 హెక్టార్లలో అభివృద్ధి..

ప్రతి శని, ఆదివారాల్లో సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది. హైదరాబాద్, ఇతర జిల్లాల నుంచి పర్యటకులు వస్తుంటారు. ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి పనులు పూర్తయి అందుబాటులోకి వస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరగడం ఖాయం. ఈ మేర అటవీ శాఖకు ఆదాయం సైతం పెరగనుంది. వసతుల కల్పనకు నందిఘాట్ సమీపంలో 80 హెక్టార్లను గుర్తించారు. ఇక్కడే ఎబ్బనూరు చెరువు ప్రాంతం వరకు అభివృద్ధికి ప్రతిపాదించారు.

● ఔషధ మొక్కలపై అవగాహన కల్పనకు ప్రత్యేక ప్రాజెక్టును సిద్ధం చేస్తున్నారు.

● ట్రీ హౌస్‌లు, టెంట్లలో సందర్శకులు బస చేసేలా సౌకర్యాలు కల్పించనున్నారు. ఇందుకు రెండు, మూడెకరాలలో వసతులు కల్పిస్తారు.

ప్రత్యేకతలు ఇవీ

● 3800 ఎకరాల్లో అనంతగిరి కొండలు విస్తరించాయి. సముద్ర మట్టానికి 600 అడుగుల ఎత్తులో ఈ ప్రాంతం ఉంది.

● అనంత పద్మనాభ స్వామి కొలువయ్యాడు.

● వెయ్యి ఎకరాలలో 50కి కంటే ఎక్కువ ఔషధ మొక్కలు ఇక్కడ ఉన్నాయి.

● 1946లోనే క్షయ వ్యాధి నివారణ చికిత్సాలయాన్ని నెలకొల్పారు. ప్రస్తుతం ఇందులోనే ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటైంది.

బహిష్కరణ బాధితులకు అండగా అధికారులు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని గౌతోజిగూడెంలో ఓ కుటుంబాన్ని ఈ నెల 10న గ్రామపెద్దలు కుల బహిష్కరించడంపై బాధితుల ఫిర్యాదు మేరకు మనోహరాబాద్ పోలీసులు 31 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు 16 మందిని అదుపులోకి తీసుకోగా, 15 మంది పరారీలో ఉన్నారు. ఈ ఘటనపై ఇటీవల బాధితులు హైకోర్టును ఆశ్రయించగా, చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామంలో కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. బాధిత కుటుంబంపై వివక్ష చూపకుండా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బాధితుడి కూతురు పాఠశాల బస్సులో వెళ్లేప్పుడు ఎవరూ మాట్లాడకపోవడం, ఇంటి వద్ద తోటివారు ఆడుకోకపోవడం వంటి ఘటనలతో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నారు. కిరాణా దుకాణంలో సామగ్రి ఇవ్వడం లేదని తెలవడంతో, అలాంటివి జరగకుండా వ్యాపారులకు ప్రత్యేక సూచనలు చేశారు. బాధితులు చంద్రం, అర్జున్, నర్సమ్మ కుటుంబ సభ్యులు పోలీసులు అండగా నిలిచారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో మనోహరాబాద్ ఎస్సై సుభాష్‌గౌడ్, పోలీసులు ఎప్పటికప్పుడు వారి యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు.

వర్గల్ నవోదయకు 'పీఎంశ్రీ' హోదా

వర్గల్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయానికి పీఎంశ్రీ హోదా దక్కినట్లు ప్రిన్సిపల్ రాజేందర్ పేర్కొన్నారు. పీఎంశ్రీ పథకం ప్రకారం నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం. ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల నుంచి నిధులు సమకూరుతాయని అవసరమైన మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 14 వేల పాఠశాలలు ఎంపిక కాగా అందులో రెండో విడతలో వర్గల్ నవోదయ ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు.

సింగూరు నీటి రాక.. ఆలయం మూసివేత



సింగూరు ప్రాజెక్టు నుంచి సోమవారం దిగువకు నీటిని విడుదల చేయడంతో మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద మంగళవారం వరద ప్రవాహం పెరిగింది. దీంతో తెల్లవారుజామున అర్చకులు మాత్రమే గర్భగుడిలోకి వెళ్లి అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్ర నామార్చన చేపట్టి మూసివేశారు. భక్తులను అనుమతించలేదు. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు కొనసాగించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వరద ప్రవాహం తగ్గితే బుధవారం ఆలయం తెరిచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 11,000 క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహిస్తోంది. - న్యూస్‌టుడే, పాపన్నపేట

క్రీడల్లో ప్రతిభ చూపితే పారితోషికాలు: మంత్రి


ఎల్లమ్మ చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పురాధ్యక్షురాలు రజిత, ఆర్డీవో రామ్మూర్తి

హుస్నాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే పారితోషికాలు అందించి ప్రోత్సహిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని మినీ స్టేడియాన్ని ఆయన సందర్శించారు. స్థానిక ఎల్లమ్మ చెరువులో ఇటీవల నిమజ్జనోత్సవం అనంతరం చేరిన వ్యర్థాలను మంత్రి, అధికారులు, ప్రజాప్రతినిధులు తొలగించే పనిని చేపట్టారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మినీ స్టేడియంలో క్రీడాకారులతో కలిసి 'స్వచ్ఛతా హీ సేవ' ప్రతిజ్ఞ చేయించారు. వారితో మంత్రి మాట్లాడుతూ.. క్రీడా సౌకర్యాలను విద్యార్థులు, ఆటగాళ్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి

మెదక్ టౌన్: ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవనంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రుల్లో సరిపడా వైద్యులను నియమించడంతో పాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దేవయ్య, మల్లేశం, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకొచ్చి.. నీటిని పారించుకొని..


పూడిక తొలగిస్తున్న రైతులు



ఎవరైనా వచ్చి ఏదైనా చేస్తారని ఎదురుచూడలేదు ఆ రైతులు. స్వయంగా తమ సమస్యను పరిష్కరించుకొని సాగు నీటికి ఢోకా లేకుండా చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలో నల్ల వాగు పారుతోంది. వాగుపై జలాశయం నిర్మించారు. ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీ-4 నుంచి వెళ్లే కాలువ ద్వారా బీబీపేట, ఫతేపూర్ గ్రామాల మీదుగా మార్డి వరకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇక్కడి వరకు కుడి కాలువ నిర్మించగా.. బీబీపేట వరకు బాగుంది. ఆ తర్వాత పూడిక పేరుకుపోయి, కాలువ అధ్వానంగా మారడంతో వరద పారని పరిస్థితి.

వందెకరాలలో.. మార్డి గ్రామ పరిధిలో బోరుబావుల కింద వందెకరాలలో వరి సాగు చేశారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉండగా, బోరుబావుల్లో నీటి మట్టాలు తగ్గడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో ఇక్కడి రైతులు ముందుకొచ్చి సాగునీటి సమస్య పరిష్కారానికి పూనుకున్నారు. రూ.1.50 లక్షలు పోగు చేసుకొని 3 కి.మీ. మేర పూడిక తొలగించుకొని కాలువను బాగు చేసుకున్నారు. ఇందుకు రెండు రోజులు శ్రమించారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా కాలువ ద్వారా పొలాలకు నీరందుతోంది. ప్రతి ఏటా నీరు విడుదలకు ముందు నీటిపారుదల శాఖ సిబ్బంది కాలువల్లో పూడిక తొలగించేవారు. ఈ సారి చర్యలు తీసుకోకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా ముందుకురావడం విశేషం.

– న్యూస్‌టుడే, కల్హేర్

చేనేతలో స్వయం ఉపాధికి 'సమర్థ' పథకం


యువతికి పుస్తకాలు, సామగ్రి అందజేస్తున్న చేనేత సేవా కేంద్రం హైదరాబాద్ ఏడీ పుహళేంది

దుబ్బాక, న్యూస్‌టుడే: చేనేత రంగంలో యువతి, యువకులకు నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణ ఇవ్వడం ద్వారా స్వయం ఉపాధి సామర్థ్యంతో పాటు ఆర్థిక స్వావలంబన పెంపొందించే దిశగా సమర్థ పథకం ఎంతగానో తోడ్పడుతుందని చేనేత సేవా కేంద్రం హైదరాబాద్ ఏడీ ఎస్.పుహళేంది అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని చేనేత సహకార సొసైటీ లిమిటెడ్, దుబ్బాక హ్యాండ్లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌లలో యువతకు 45 రోజుల సమర్థ పథకం శిక్షణను ఆయన ప్రారంభించారు. శిక్షణకు ఉపయోగపడే సామగ్రిని అందించారు. ఆయన మాట్లాడుతూ..చేనేత రంగంపై ఆసక్తితో యువత నేటి సాంకేతికతను అందిపుచ్చుకొని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి లభిస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు గాజుల బాస్కర్, బోడ శ్రీనివాస్, అధికారులు పవన్ కుమార్, బాలాజీ, సంతోష్‌కుమార్, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జట్టుతో నిర్వాహకులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు 40 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. మంగళవారం మెదక్‌లోని వెస్లీ పాఠశాల మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-17 విభాగంలో బాల, బాలికలకు వేర్వేరుగా ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి బాలురు-161, బాలికలు-86 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన 40 మందిని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. అక్టోబరు 3 నుంచి 5 వరకు మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయని, ఈ పోటీల్లో సదరు జట్టు పాల్గొంటుందని ఎస్జీఎఫ్ మెదక్‌జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. నిర్వాహకుడు నాగరాజు, పీడీలు రూపేందర్, సుజాత, శ్రీనివాసరావు, మాధవరెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు, ఉద్యోగుల గొంతుకనవుతా..


మాట్లాడుతున్న డా.నరేందర్‌రెడ్డి తదితరులు

మెదక్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల సాధనకు చట్టసభలో వారి గొంతుకై పనిచేస్తానని కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానాకి పోటీ చేయాలనుకుంటున్న ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మెదక్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగం రాక.. జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయారని అన్నారు. ఉద్యోగాల ఖాళీల భర్తీకి, డీఏ, ఇంక్రిమెంట్ల సాధనకు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే వారికి ఆరోగ్యకార్డులు, ఫీజు రియంబర్స్‌మెంట్ సకాలంలో అందించేలా కృషి చేస్తానన్నారు. నూతన విద్యా పాలసీ తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, దీనివల్ల ఇంటర్, పదో తరగతి బోర్డులు ఉంటాయా? లేదా? అనే సందేహాలు కలుగుతున్నాయని అన్నారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించేందుకు, సమస్యల పరిష్కారానికి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీగా గెలిచాక సేవకుడిగా ఉంటానని, వేతనాన్ని పేదల విద్యాభ్యాసం, నిరుద్యోగ సంక్షేమనిధి ఏర్పాటు చేసి కేటాయిస్తానని తెలిపారు. ప్రస్తుతం పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. స్నేహ విద్యాసంస్థల బాధ్యులు సత్యనారాయణ, బాధ్యులు ఫణిందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


చిన్నచెల్మెడ అంగన్వాడీ కేంద్రం వద్ద బృందం సభ్యులు

ఐసీడీఎస్ కేంద్ర బృందం పర్యటన

మునిపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధి పెద్దచెల్మెడ, చిన్న చెల్మెడ అంగన్వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ కేంద్ర బృందం అధికారులు పరిశీలించారు. మంగళవారం ఝార్ఖండ్, బిహార్, ఉత్తరాఖండ్, దిల్లీ రాష్ట్రాలకు చెందిన పలువురు అధికారుల బృందం ఆయా గ్రామాల్లో పర్యటించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అభ్యసన అభివృద్ధిపై తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలపై టీచర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు రేణుక, మీనాక్షి ఉన్నారు.

అద్దెకు ఇల్లు కావాలని వచ్చి.. వృద్ధురాలి గొలుసు చోరీ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: వృద్ధురాలిని మాటల్లో పెట్టి ఆగంతకుడు గొలుసు లాక్కెళ్లిన ఘటన సిద్దిపేటలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు, తెలిపిన వివరాలు.. పట్టణంలోని మాజీ సర్పంచి కోరె ఎల్లయ్య తల్లి సత్తవ్వ (70) మంగళవారం ఇంట్లో కూర్చుని ఉండగా గుర్తు తెలియని యువకుడు వచ్చి ఇల్లు అద్దెకు ఉందా. . అని అడిగాడు. ఆమె లేదని చెప్పడంతో తాగేందుకు మంచినీళ్లు ఇవ్వాలని కోరాడు. ఆమె తెచ్చిచ్చిన నీళ్లు తాగి వెళ్లబోతూ ఒక్క ఉదుటున వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొని బయట నుంచి తలుపు గడియ పెట్టి పరారయ్యాడు. ఆమె కేకలకు కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికి దుండగుడు పరారయ్యాడు. కుమారుడు ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ ఉపేందర్ చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం


తిరుపతి

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామ పరిధి జాలుబాయితండా సమీపంలో విద్యుదాఘాతంతో గుగులోతు తిరుపతి(25) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. ధూల్మిట్ట మండలం కొండాపూర్ పరిధి జురాలతండాకు చెందిన తిరుపతి పరిసర గ్రామాల్లో ప్రైవేటుగా ఎలక్ట్రికల్ పని చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. మంగళవారం సాయంత్రం నియంత్రిక ఏబీ స్విచ్ ఆపి సరఫరా నిలిపివేసేందుకు యత్నించాడు. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడిని నియంత్రిక వద్దకు ఎవరు పంపారనేది తెలియాల్సి ఉంది. ఎస్ఐ విజయభాస్కర్ ఘటనా స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. కేసు నమోదైంది. తిరుపతికి వచ్చే నెలలో నిశ్చితార్థం జరగాల్సి ఉంది.

బోరు వద్ద పొదలు తొలగిస్తుండగా వృద్ధుడు..


అంజయ్య

దుబ్బాక: పొలంలోని బోరు వద్ద ఉన్న పొదలను తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురైన వృద్ధుడు మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్ఐ వి.గంగరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని రఘోత్తంపల్లికి చెందిన గౌరి అంజయ్య (71), ఎల్లవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారం. పిల్లలందరికీ వివాహాలు అయ్యాయి. సోమవారం రాత్రి పొలం వద్ద మొక్కలు తొలగించేందుకు కొడవలితో కోస్తుండగా ప్రమాదం జరిగింది. కుమారుడు గుర్తించి పరిశీలించగా అంజయ్య అప్పటికే మృతి చెందాడు. కుమారుడు నరేశ్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి


అలీ రెహమాన్

యాలాల: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితి మృతి చెందినట్లు వికారాబాద్ జిల్లా యాలాల ఎస్ఐ శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. యాలాల పరిధి ఇందిరమ్మ కాలనీకి చెందిన అలీ రెహమాన్ (38), పర్వీన్‌బేగం దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. అలీ రెహమాన్ సామాజిక కార్యకర్తగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. అదే కాలనీలో విడివిడిగా ఉంటున్నారు. మూడు రోజుల క్రితం రెహమాన్ ఇంటికి తాళం వేసుకొని నిద్రించాడు. మంగళవారం సాయంత్రం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. అలీ రెహమాన్ విగతజీవిగా కనిపించాడు. భార్య పర్వీన్ బేగం ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చెరువులో పడి వృద్ధుడు..


భూమయ్య

హవేలిఘనపూర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి చెందాడు. మెదక్ జిల్లా హవేలిఘనపూర్ ఏఎస్ఐ రాజు తెలిపిన వివరాలు.. మండలంలోని బూర్గుపల్లికి చెందిన గుండమొల్ల భూమయ్య (70) కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ శివారులో ఉన్న శ్రీపతి చెరువు వద్దకు వెళ్లాడు. కాలుజారి చెరువులో పడి ఊపిరాడక మృతి చెందాడు. భూమయ్య ఇంటికి రాకపోవడంతో గ్రామ శివారులో వెతకగా చెరువు వద్ద భూమయ్య చేతి కర్ర, చెప్పులు కనిపించాయి. ఈతగాళ్ల సాయంతో చెరువులో గాలించగా మృతదేహం లభించింది. భూమయ్య కుమారుడు రామానుజన్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఆర్థిక సమస్యలతో యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకొని తనువు చాలించాడు. జీడిమెట్ల ఎస్సై నాయుడు తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాలకు చెందిన కృష్ణసాయి (23) కొన్ని నెలల క్రితం ఉపాధికి హైదరాబాద్ చింతల్‌కు వలస వెళ్లాడు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో పని చేస్తూ.. అక్కడి శ్రీనివాసనగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కొన్నాళ్లుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మంగళవారం తానుంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఆరోగ్య ప్రశస్తి

విద్యార్థుల్లో లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, కంది, పరిగి, నర్సాపూర్

ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పం. ఇందులో భాగంగా పాఠశాల్లో చదువుతున్న పిల్లల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా అని గుర్తించేందుకు సరికొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. బాధితులకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రశస్తి యాప్‌ను విద్యాశాఖ రూపొందించింది. ఉపాధ్యాయులే నేరుగా పిల్లలను పరీక్షించి వారిలో ఉన్న లోపాలను అందులో నమోదు చేయనున్నారు. వాటిని పరిశీలించి ఉన్నతాధికారులు వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటారు.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో విద్యాశాఖ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర విభాగాల పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రశస్తి యాప్‌పై అవగాహన కల్పిస్తోంది. ముందుగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఉపాధ్యాయులు.. పేరు, సర్వీసు నంబరు, మెయిల్ ఐడీ, చరవాణి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థుల పేర్లను నమోదు చేయాలి. దీనికి ఈ నెల 23న ప్రారంభమైన శిక్షణ 25 వరకు కొనసాగనుంది. విద్యార్థులు ఏదైనా ఆరోగ్య సమస్య, అవయవ లోపంతో బాధపడతారు. బయటకు చెప్పుకోలేక ఇబ్బంది పడుతుంటారు. వీరికి మెరుగైన వైద్య సేవలు అందించి సాధారణంగా మార్చమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
సంగారెడ్డి	1,820	2,50,110
సిద్దిపేట	1,845	2,92,200
మెదక్	1,529	2,20,400
వికారాబాద్	1,623	2,39,200


ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న సీఎంవో

64 ప్రశ్నలకు..

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయ్యాక కార్యక్రమం అమలుచేస్తారు. దీన్ని రెండు రకాలుగా విభజించారు. యాప్‌లో అడిగిన ప్రశ్నలకు ఉపాధ్యాయులు కొన్నింటిని పిల్లల నుంచి రాబడతారు. మరికొన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలి.

పార్ట్–1: ఈ నెల 26 నుంచి అక్టోబరు 26 వరకు కొనసాగుతుంది. యాప్‌లో ఉండే 64 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బోధన సమయంలో అందరినీ పరిశీలించాలి. సరిగా చూస్తున్నాడా, గమనిస్తున్నాడా, చదువుతున్నాడా, అవయవ లోపం, వినికిడి లోపం, నత్తిగా మాట్లాడటం, మనోవైకల్యం, అర్థం చేసుకుంటున్నాడా.. ఇలాంటివి ఉంటాయి. ఏది ఉందో గమనించి నమోదు చేయాలి.

పార్ట్–2: అక్టోబర్ 27 నుంచి నవంబరు 14 వరకు దీన్ని కొనసాగిస్తారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే ఉపాధ్యాయులు లోపం ఉన్న వారిని పరిశీలిస్తారు. లోపాన్ని గుర్తించి వైద్యులకు సిఫార్సు చేస్తారు. వైద్యులు పరిశీలించి చికిత్స అందిస్తారు.

పకడ్బందీగా అమలు

వెంకటేశం, సీఎంవో, సమగ్ర శిక్ష, సంగారెడ్డి

ప్రశస్తి యాప్‌ను పక్బందీగా అమలు చేస్తాం. ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి వివరాలు పక్కాగా నమోదయ్యేలా చూస్తాం. నెల రోజుల పాటు ప్రతి విద్యార్థిని ఉపాధ్యాయుడు బోధన చేస్తూ స్క్రీనింగ్ చేస్తారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన తప్పనిసరి

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బీఐ సీఎఫ్‌ఎల్ అధికారులు నాగేందర్, సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్థిక విధి విధానాలు, ఇతర ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ రంగ సంస్థ ఎస్‌బీఐ ఖాతాదారులు, విద్యార్థులకు అందిస్తున్న సేవలను వివరించారు. ప్రిన్సిపల్ శశిధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కుటుంబాల ఆరోగ్యానికి ప్రాధాన్యం

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగులతో పాటు వారి కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగుతుందని మెదక్ డిపో మేనేజర్ సురేఖ అన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని డిపో గ్యారేజ్‌లో ఉద్యోగుల భాగస్వాములకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరం ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టీజీడబ్ల్యూడీసీలో ప్రవేశాలకు 27 చివరి తేదీ

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: టీజీడబ్ల్యూడీసీ మెదక్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్లకు ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 27 చివరి తేదీ అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, ఎంపీసీఎస్, బీజెడ్‌సీ, ఎంబీజీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు చరవాణి నంబరులో (7901097706) సంప్రదించాలని సూచించారు.

ప్రజా సేవలో సీతారాం ఏచూరి: సీపీఎం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: సీపీఎం జాతీయ నాయకుడు దివంగత సీతారాం ఏచూరి పదవులు ఆశించకుండా దేశ, ప్రజా సేవలో తరించారని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం తెలిపారు. మండలంలోని బండపోసానిపల్లి గ్రామంలో సీపీఎం మండల శాఖ తరఫున నిర్వహించిన ఏచూరి సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో జరుగుతున్న అరాచకాలు, అక్రమాలపై గొంతెత్తి పోరాటాలు చేశారని పేర్కొన్నారు. కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం కృషి చేశారని కొనియాడారు. సీపీఎం మండల కార్యదర్శి గౌరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మిల్లు వ్యాపారి స్థిరాస్తి వేలం

నర్సాపూర్, న్యూస్‌టుడే: నర్సాపూర్‌కు చెందిన రైస్ మిల్లు వ్యాపారి పైడి శ్రీధర్ గుప్తా ధాన్యం బకాయిలు రూ.47.17 కోట్లు చెల్లించాల్సి ఉన్నందున, ఆయన స్థిరాస్తులను తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఫిబ్రవరి 27న నిర్వహించిన కార్యక్రమంలో అత్యధికంగా వేలం పాడి దక్కించుకున్న కొందరు సకాలంలో బకాయిలు చెల్లించలేదన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో రికార్డుల పరిశీలన

చేగుంట: చేగుంట ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో ఎల్లయ్య మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రెడ్డిపల్లి పీఏసీఎస్ పరిధిలో రైతు రుణమాఫీపై జరిగిన పొరపాటుతో ఇటీవల సస్పెండ్ అయిన సీఈవో నరేశ్‌తో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో చిన్నారెడ్డి, సీనియర్ సహాయకులు శ్రీశైలం ఉన్నారు.

బోధన సాగేదెలా?

- ఉపాధ్యాయుల కొరత
- విద్యార్థులకు ఇబ్బందులు

న్యూస్‌టుడే, వెల్దుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడుతోంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు అనే తేడా లేకుండా అన్నింట్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో బోధన సరిగా సాగక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఏకోపాధ్యాయ బడుల్లో సమస్య మరీ తీవ్రంగా ఉంది.

ఉమ్మడి వెల్దుర్తి మండలంలో మొత్తం 54 సర్కారు బడులు ఉండగా 33 మంది బోధకుల కొరత ఉంది. పిల్లల సంఖ్యకు తగ్గట్టుగా ఏ ఒక్క బడిలో ఉపాధ్యాయులు లేరు. ఇక ప్రతి తరగతికి, సబ్జెక్టుల వారీగా ఉండటం కలలో కూడా ఊహించలేం. వెల్దుర్తి మండలంలో 35 స్కూళ్లు, 2997 మంది విద్యార్థులు ఉన్నారు. 163 మంది బోధకులు ఉండాలి. కానీ 136 మందే ఉన్నారు. మాసాయిపేట మండలంలోని 19 బడుల్లో 1318 చదువుతున్నారు. ఇక్కడ73 మందికి గాను 67 మందే టీచర్లు ఉన్నారు.

ఇక్కడ సమస్య తీవ్రం

మాసాయిపేట మండలం కొప్పులపల్లిలో ఐదు తరగతుల్లో 95 మంది విద్యార్థులకు ఇద్దరు మహిళా ఉపాధ్యాయులు ఉన్నారు. మండల వనరుల కేంద్రానికి, విద్యా శాఖకు సంబంధించి ఇతరత్రా పనులపై ఒకరు వెళ్తే మరొకరు అన్నీ చూసుకోవాలి. బోధించడం, చిన్నారులను వారిని గమనించడం కష్టమే. అచ్చంపేటలో ఏడు తరగతులకు కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు, వెల్దుర్తి మండలం యశ్వంతరావుపేటలో ఏడు తరగతుల్లో

మార్పులు చేర్పులు చేస్తాం

పాఠశాలల్లో తరగతులు, విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని మార్పులు చేర్పులు చేస్తున్నాం. ఈ విషయమై విద్యాశాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. ఎక్కువ మంది టీచర్లు ఉన్నచోటు నుంచి ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేస్తున్నాం.

-అరికెల యాదగిరి, ఎంఈవో, వెల్దుర్తి



కొప్పులపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయురాలు

106 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఎనిమిది మంది టీచర్లకు కేవలం ఐదుగురు ఉన్నారు.

శివ్వంపేట మండలంలో..

శివ్వంపేట మండలంలోనూ కొరత వేధిస్తోంది. ముఖ్యంగా పెద్ద గొట్టిముక్క ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉంది. 85 మంది విద్యార్థులకు ఏడుగురు టీచర్లు ఉండాలి. ఇద్దరు రెగ్యులర్, ముగ్గురు డిప్యుటేషన్‌పై వచ్చిన వారే కొనసాగుతున్నారు. మల్లుపల్లికి చేగుంట మండలం రుక్మాపూర్ బడి నుంచి బదిలీపై రావలసిన ఉపాధ్యాయుడు ఇంకా చేరలేదు. ఇక్కడ బోధన సరిగా సాగడం లేదు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్	95730 81675
నర్సాపూర్	80085 73222
తూప్రాన్	96762 58144
చేగుంట	80085 73200
పెద్దశంకరంపేట	80085 73251
రామాయంపేట	94402 31031

(10AM TO 1 PM)

న్యూస్‌టుడే, అల్లాదుర్గం

? గడిపెద్దాపూర్ గ్రామానికి సరఫరా చేసే విద్యుత్తు సరఫరాలో నిత్యం అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. -రమేశ్, గడిపెద్దాపూర్

✔ సిబ్బందిని క్షేత్ర స్థాయిలో పంపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. -శివాజీ, ఏఈ, విద్యుత్తు శాఖ, అల్లాదుర్గం.

గుంతపై మూత ఏర్పాటు

స్పందనకు వందనం

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: మిర్జాపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో సీసీ రహదారి పక్కన ప్రమాదకర గుంత ఉంది. దీనిపై మూత ఏర్పాటు చేయాలని 'మరిన్నే చింత' అనే శీర్షిక సోమవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. తహసీల్దార్ మన్నన్ గ్రామానికి వెళ్లి గుంతను పరిశీలించారు. పంచాయతీ సిబ్బందితో మూత వేయించి పొదలను తొలగించే చర్యలు చేపట్టారు.

పీఆర్టీయూటీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



సన్మానం అందుకున్న నూతన కార్యవర్గ సభ్యులు

రేగోడ్, న్యూస్‌టుడే: రేగోడ్ మండల పీఆర్టీయూటీఎస్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నట్లు సంఘం బాధ్యులు తెలిపారు. మండలాధ్యక్షుడిగా అంజిబాబు, ప్రధాన కార్యదర్శిగా రాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా పరిపూర్ణం, కార్యదర్శిగా సంజీవులు, మహిళ విభాగం ఉపాధ్యక్షురాలిగా సుశీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు వెంకన్న, బస్వరాజ్, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, కరుణాకర్

కొల్చారం, న్యూస్‌టుడే: పీఆర్టీయూ టీఎస్ కొల్చారం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పోతంశెట్టిపల్లిలోని హనుమమ్మ గార్డెన్‌లో మంగళవారం సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా పట్లూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్, అసోసియేట్ అధ్యక్షునిగా ఎగోండ, మహిళ ఉపాధ్యక్షురాలిగా తులసి, కార్యదర్శిగా శశాంక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



మెదక్‌లో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ



పాలటలో విద్యార్థుల ప్రదర్శన

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

మెదక్ టౌన్, చిలప్‌చెడ్, మెదక్ రూరల్, మనోహరాబాద్, చిన్నశంకరంపేట, నిజాంపేట, రామాయంపేట, కౌడిపల్లి, పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రతి పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మెదక్ పురపాలిక శానిటరీ అధికారి మల్లికార్జున్ సూచించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మెదక్ పట్టణంలోని 1, 9, 18 వార్డుల్లో, గీత పాఠశాల విద్యార్థులకు తడి, పొడి చెత్త సేకరణ గురించి వివరించారు. స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. పరిశుభ్రతపై చిలప్‌చెడ్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో ఎంపీడీవో ఆనంద్ అవగాహన కల్పించారు. మెదక్ మండలం రాజ్‌పల్లిలో పలు మురుగు కాల్వలను శుభ్రం చేశారు. మనోహరాబాద్ మండలం పాలటలో విద్యార్థులు పరిశుభ్రతపై నాటిక ప్రదర్శించారు. చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి, నిజాంపేట మండల పరిధి రాంపూర్, పాపన్నపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, పాటలు, నృత్య పోటీలు నిర్వహించారు. వెల్మకన్నె, కౌడిపల్లి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛతపై ఎంపీడీవో శ్రీనివాస్ అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.

నిమజ్జనోత్సవంలో లడ్డూల వేలం

కౌడిపల్లి, న్యూస్‌టుడే: కౌడిపల్లి మార్కెట్‌యార్డు వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జనాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి లడ్డూను వేలం వేయగా మక్బుల్ అనే వ్యక్తి రూ. 36,616లకు వేలం పాడి దక్కించుకున్నారు. చిన్న లడ్డూను రూ. 7001 లకు పోల జనార్దన్ సొంతం చేసుకున్నారు. అనంతరం గ్రామ వీధుల మీదుగా శోభాయాత్ర నిర్వహించి స్థానిక పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

ఫిజియోథెరపీ శిబిరం పరిశీలన

నార్సింగి(చేగుంట), న్యూస్‌టుడే: నార్సింగి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం దివ్యాంగులు, మానసిక వికలాంగులకు నిర్వహించిన ఫిజియోథెరపీ శిబిరాన్ని జిల్లాకు చెందిన ఎంసీవో సతీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిబిరాలతో మార్పు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రామకృష్ణ, ఫిజియోథెరపిస్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చేగుంట, న్యూస్‌టుడే: చేగుంట మండలం బి.కొండాపూర్‌కు చెందిన మహేష్ పాముకాటుకు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా కార్యదర్శి భిక్షపతి తదితరులు బాధిత కుటుంబసభ్యులను మంగళవారం పరామర్శించారు. రూ. 9000 ఆర్థిక సాయం అందజేశారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీలో ప్రతిభ



బంగారు పతక విజేతలను అభినందిస్తున్న సంఘ సభ్యులు

తూప్రాన్, న్యూస్‌టుడే: ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు సిరిసిల్లలో జరిగిన 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లోజిల్లా బాలుర జట్టు బంగారు పతకం సాధించడం గర్వకారణమని జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడిప్యాక నారాయణ గుప్తా పేర్కొన్నారు. జిల్లా జట్టు తొలి నుంచి ఆధిపత్యం వహించి ఫైనల్ లో నిజామాబాద్ జట్టుతో హోరాహోరీగా తలపడి 5-3 స్కోర్‌తో విజయం సాధించిందన్నారు. ఈ సందర్భంగా వారిని మంగళవారం తూప్రాన్‌లో అభినందించారు. జిల్లా జట్టు కోచ్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలం.. భయం భయం



కూకుట్లపల్లిలోని అంగన్వాడీ భవనం పైకప్పు పెచ్చులూడి పోవడంతో చిన్నారులు భయంభయంగా గడుపుతున్నారు. పంచాయతీ భవనంలోనే కొన్నేళ్లుగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. 20 మంది చిన్నారులు నమోదై ఉన్నారు. వర్షాలు కురిసిన సమయంలో చిన్నారులను వరండాపై కూర్చోబెడుతున్నారు. అంగన్వాడీ టీచర్ లేక భుజిరంపేట నుంచి నెలకు రెండు సార్లు వచ్చి పోతున్నారు. ఆయా బిస్మిల్లా బాధ్యతలు చూస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు కమర్ సుల్తానా మాట్లాడుతూ.. కేంద్రాన్ని సందర్శించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. **-న్యూస్‌టుడే, కౌడిపల్లి**



పెద్ద గొట్టిముక్కకు చెందిన సినీ గాయకుడు, సంగీత దర్శకుడు, లిటిల్ మ్యుజీషియన్స్ అకాడమీ వ్యవస్థాపకులు కొమాండూరి రామాచారి మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో కిన్నెర-బాలు పురస్కారం అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు కె.వి రమణచారి, సినీ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్, తదితరులు ఆయన్ను సత్కరించారు. –న్యూస్‌టుడే, శివ్వంపేట

శభాష్‌పల్లిలో పోషణ ప్రతిజ్ఞ

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం శభాష్‌పల్లి అంగన్వాడీ కేంద్రం వద్ద పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అనురాధ, హెచ్‌ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో తెగులు నివారణ



ఎదురుల్లాపూర్‌లో తెగులు సోకిన వరిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, ఏడీఏ

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: అధికారుల సూచనలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపట్టిన రైతులకు నష్టాలు ఉండవని, మంచి లాభాలు ఉంటాయని వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వర్మ, డాక్టర్ కిరణ్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరిత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చండూరులో రైతు చంద్రశేఖర్ రెడ్డి కేపీఎస్, కేఎన్‌ఎం వంటి కొత్త వంగడాలతో సాగు చేసిన పంటలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గింజ మచ్చ, కాండం తొలుచు పురుగు, ఆకు ముడత నివారణ పద్ధతులు వివరించారు.

శివ్వంపేట: శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్‌లోని పంట పొలాలను తునికి శాస్త్రవేత్త రవి, నర్సాపూర్ వ్యవసాయ సంచాలకులు సంధ్య రాణి, ఏవో లావణ్యతో కలిసి మంగళవారం సందర్శించారు. రైతుల పొలాల్లో అగ్గితెగులు, ఆకు ఎండు తెగులు గుర్తించి నివారణ చర్యలు వివరించారు.

విద్యార్థులు భావితరానికి పునాదులు



విజేతకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ ఉమాదేవి

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు భావితరానికి పునాదులు అని, సమాజ మార్పు కోసం నిర్వహించే పలు కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ సూచించారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం డిగ్రీ కళాశాలలో సమావేశంలో నిర్వహించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీలత, మురళి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోటలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న కళాశాల విద్యార్థిని వనజతో పాటు పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాదేవి ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ అధికారిణి దీపిక, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించండి



ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూపంచాయతీ కార్యదర్శులు మంగళవారం హవేలిఘనపూర్ ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిధుల కొరత ఉండటంతో తమ వేతనాలతో పాటు అప్పులు చేసి పంచాయతీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు ఖర్చుపెట్టిన బిల్లులు రాలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు వెంకటేశ్వర్, శ్రీకాంత్, గురవయ్య , ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దారిలో పొంచి ఉన్న ప్రమాదం



పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద మెదక్-బోధన్ ప్రధాన రహదారి మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్ పై కప్పు ధ్వంసం అయింది. దీనిస్థానంలో కొత్తది వేయకుండా సంబంధిత అధికారులు కర్రలను అడ్డుగా పెట్టి చేతులు దులుపేసుకున్నారు. రోడ్డుకు సరిగ్గా మధ్యలో ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు వందల సంఖ్యలో పలు రకాల వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఇక్కడ ప్రమాదం జరగకముందే ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. **–న్యూస్‌టుడే, మెదక్ టౌన్**

మౌలిక వసతులు కల్పించాలి: టీపీటీఎఫ్



టీపీటీఎఫ్ సభ్యత్వాలను అందజేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి

చేగుంట, న్యూస్‌టుడే: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి కోరారు. మంగళవారం చేగుంట మండలంలో టీపీటీఎఫ్ సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మన ఊరు-మన బడి కింద చేపట్టిన పనులు అంతటా అసంపూర్తిగా వదిలేశారని తెలిపారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇంతవరకు భర్తీ చేయలేదన్నారు. టీచర్లను సర్దుబాటు చేయలనే అసంబద్ధమైన ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు విఠల్ రెడ్డి, శశిధర్‌రెడ్డి, యాదగిరి, ప్రభాకర్, బాలపోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ దినోత్సవం

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: అల్లాదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ తుకారం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సమాజ సేవ అందించడంలో ముందుండాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నరసింహారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళాశాలలో శ్రమదానం

రామాయంపేట, న్యూస్‌టుడే: చదువుతో పాటు విద్యార్థులు సమాజ సేవలో పాల్గొనాలని రామాయంపేట ప్రభుత్వం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హిమజ్యోతి అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ఆవరణలో శ్రమదానం కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమ అధికారి బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇనుప స్తంభం తొలగించరూ..

శివ్వంపేట, న్యూస్‌టుడే: సికింద్లాపూర్‌లో ఇళ్ల మధ్య ఇనుప స్తంభం ప్రమాదకరంగా మారింది. గత కొన్ని రోజులుగా స్తంభం నుంచి షాక్ వస్తుందన్నారు. సమస్యను అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా దానిని తొలగించి సిమెంటు స్తంభాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మనోహరాబాద్ మండలంలో వర్షం

మనోహరాబాద్: మనోహరాబాద్ మండలంలో మంగళవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు వచ్చే సమయానికి వర్షం పడడంతో తడిసి ముద్దయ్యారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందించాలని మండల వ్యవసాయ అధికారి బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయా గ్రామాల్లో ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ల్యాబ్‌కు పంపించేందుకు నమూనాలు సేకరించారు.

భాజపా సభ్యత్వ నమోదు

టేక్మాల్, న్యూస్‌టుడే: భాజపా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని, వారే పార్టీకి పట్టుకొమ్మలని ఆ పార్టీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి పేర్కొన్నారు. టేక్మాల్ మండల పరిధిలోని తంపులూర్‌లో మంగళవాం ఆన్‌లైన్‌లో సభ్యత్వం చేయించారు. నాయకులు జగదీశ్‌పాటిల్, చంద్రశేఖర్, రాజు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

శివ్వంపేట: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రేటర్ బంజారా ఆధ్వర్యంలో శివ్వంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంతాల పరిశుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ వీర కళ్యాణ్ గౌడ్ అవగాహన కల్పించారు. అనంతరం దంత పరీక్షలు చేసి మందులు అందజేశారు. లయన్ జువ్వాడి సంతోష్ కుమార్, హెచ్‌ఎం బాలచంద్రం పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తూప్రాన్, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో తూప్రాన్ పట్టణ పరిధి ఆబోతుపల్లికి చెందిన ఆబోతు ప్రవీణ్ యాదవ్ (30) మనస్తాపానికి గురై ఈనెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై శివానందం తెలిపారు. ఆయన భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చరవాణి దుకాణంలో అగ్నిప్రమాదం

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: పేటలోని ప్రధాన రహదారి పక్కనున్న శ్రీలక్ష్మీ చరవాణి దుకాణంలో విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం సంభవించింది. సోమవారం అర్ధరాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు దుకాణంలో మంటలు రావడం చూసి యజమాని బాలరాజు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఫ్రిడ్జ్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు రేగినట్లు గుర్తించారు. సుమారు రూ. 30 వేల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించండి



మాసాయిపేట ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు

వెల్దుర్తి(మాసాయిపేట), న్యూస్‌టుడే: ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ఎస్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య డిమాండు చేశారు. మంగళవారం మాసాయిపేట ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2022 నుంచి నేటి వరకు పెండింగ్‌లో ఉన్న అయిదు బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన డీఏలో 18.2 శాతం నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, శ్రీనివాస్ చారి, సత్యనారాయణ, రాజేశ్వర్, రవి, నాగరాజు, సృజన తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: పేటలోని అంబేడ్కర్ కూడలి వద్ద రహదారి గుంతలుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో స్థానిక ఎస్సై శంకర్ ప్రత్యేక చొరవ తీసుకొని మరమ్మతులు చేయించారు. గుంతల్లో మొరం పోయించి చదును చేయించారు.



పనులు పరిశీలిస్తున్న ఎస్సై శంకర్

చిత్రాలు వేసి.. చైతన్యం కల్పించి



వడియారం పాఠశాలలో చిత్రాలు వేసిన విద్యార్థులు

చేగుంట, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చేగుంట మండలం వడియారం జడ్పీ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు స్వచ్ఛతకు సంబంధించిన చిత్రాలు వేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం వల్ల కలిగే అనర్థాలను వివరించి ప్రజల్లో చైతన్యం కలిగేలా చేశారు. ప్రధానోపాధ్యాయురాలు లీలావతి తదితరులు పాల్గొన్నారు.